క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామం అయ్యప్పస్వామివారి ఆలయం వార్షికోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. విద్యాజ్యోతి స్కూలయం వ్యవస్థాపకులు ఆరవల్లి భాస్కర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, హోమాలు చేపట్టారు. అన్నప్రసాదవితరణ, తిరువీధి నిర్వహించారు. ఆలయ అర్చకులు మురపాక రాంబాబు శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మవారి పండగలు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో ఆదివారం నుంచి గ్రామదేవత, అమ్మవార్ల పండగలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 16 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు గ్రామంలో అత్యంత వైభంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీరోజు ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే గ్రామాన్ని విద్యుత్ దీపాలతో, తోరణాలతో అలంకరించారు.

తప్పిన ప్రమాదం



మార్కెట్ యార్డు వద్ద కూలిన భారీ కటౌట్

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21 నుంచి జరగనున్న నేపథ్యంలో నగరంలో విద్యుత్ అలంకరణ కోసం భారీ కటౌట్‌లు ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం రావడంతో మార్కెట్ యార్డు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన భారీ కటౌట్ కుప్పకూలింది. దీంతో ఆ సమయంలో వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే ఉత్సవ కమిటీ సభ్యులు పడిపోయిన కటౌట్‌లను తొలగించి రాకపోకలు జరిపించారు. గాలి, వర్షం వచ్చినప్పుడు కటౌట్‌లు వద్ద ఎవరూ ఉండవద్దని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పద్మిని గౌడ్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సంతోష్

మెళియాపుట్టి: పట్టుపురం సచివాలయం పరిధిలోని పూలసారి గ్రామానికి చెందిన పద్మిని గౌడ్ అనారోగ్యంతో జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గ్రామ వలంటీర్ సంతోష్ శనివారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు వితంతు పింఛన్ అందించాడు.

వేంకటేశ్వరస్వామి జాతర ప్రారంభం



పందిరి రాట వేస్తున్న రుత్వికులు, భక్తులు

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీలో మన్నెపేట కొండపై కొలువు దీరిన అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి 32వ జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రుత్వీకులు గన్నవరపు రాంబాబు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణానికి భక్తులతో కలిసి పందిరి రాట వేశారు.

8 నుంచి యోగా శిక్షణ

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్‌లో గల శ్రీ జ్ఞానజ్యోతీ స్కూల్లో ఈ నెల 8వ తేదీ నుంచి 13 వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని యోగా గురువు సదాశివుని రవి తెలిపారు. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవి శంకర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రాణాయామం, ధ్యానం, జ్ఞాన సూత్రాలు, సుదర్శన క్రియ వంటి వాటిపై యోగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు ఫోన్ 8142121246ను సంప్రదించవచ్చన్నారు.

సత్తా చాటారు..

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులదే హవా..

నరసన్నపేట: ప్రభుత్వం శనివారం పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల చేసింది. మండలంలో ప్రభుత్వ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 134 మంది విద్యార్థులకు 111 మంది, సుందరాపురం ఉన్నత పాఠశాలలో 26 మందికి 25 మంది, బాడాం స్కూల్లో 22 మందికి 20 మంది, మాకివలస ఉన్నత పాఠశాలలో 37 మందికి 34 మంది, బొరిగివలస స్కూల్లో 35 మందికి 30 మంది, మడపాం స్కూల్లో 42 మందికి 36 మంది, కంబకాయలో 41 మందికి 34 మంది, నరసన్నపేట బోర్డు పాఠశాలలో 129 మందికి 114 మంది, బాలికోన్నత పాఠశాలలో 42 మందికి 24 మంది, లుకలాం ఉన్నత పాఠశాలలో 27 మందికి 25 మంది, సత్యవరం స్కూల్లో 36 మందికి 29 మంది, ఉర్లాం స్కూల్లో 84 మందికి 73 మంది ఉత్తీర్ణత సాధించారు.

- సరుబుజ్జిలి: మండల వ్యాప్తంగా మొత్తం 314 మందికి 255 మంది ఉత్తీర్ణత పొందినట్లు వెల్లడించారు. జీటీడబ్ల్యూఎస్ 44 మందికి 24, గోనెపాడులో 12 మందికి 9 మంది, సరుబుజ్జిలిలో 29 మందికి 20 మంది, కాగితాపల్లిలో 23 మందికి 18 మంది, పెద్దసవళాపురంలో ఆరుగురికి ముగ్గురు, కొత్తకోటలో 52 మందికి 39 మంది, రొట్టవలసలో 55 మందికి 52 మంది, పురుషోత్తపురంలో 20 మందికి 18 మంది పాసయ్యారు.
- మెళియాపుట్టి: మండలంలోని 16 పాఠశాలలకు సంబంధించి 325 మంది బాలికలు, 274 మంది బాలురు (80.51 ఉత్తీర్ణతాశాతం) ఉత్తీర్ణులయ్యారు. నడసంద్ర పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులయ్యారు.
- కొత్తూరు: కొత్తూరు ఉన్నత పాఠశాల నుంచి 143 మంది విద్యార్థులకు 91 మంది, కడుము జెడ్పీహెచ్ఎస్ నుంచి 78 మందికి 46 మంది, కురిగాం నుంచి 27 మందికి 12 మంది, కుంటిభద్ర నుంచి 55 మందికి 38 మంది, మెట్టూరు నుంచి 161 మంది 91 మంది, నివగాం నుంచి 112 మంది 78 మంది, కేజీబీవీ నుంచి 44 మందికి 32 మంది, ఎంజేపీపీ నుంచి 29 మందికి 29 మంది, మాతల పాఠశాల నుంచి 38 మందికి 23 మంది, లబ్బ గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి 35 మంది 15 మంది పాసయ్యారు.
- హిరమండలం: మండలంలో 316 మంది విద్యార్థులకు 271 మంది ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలంలో 42 మందికి 38మంది, హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 135 మందికి 106 మంది ఉత్తీర్ణత, అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 మంది, తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 21 మందికి 21 మంది, గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 34 మందికి 28 మంది, భగీరథీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 మందికి 22 మంది ఉత్తీర్ణత సాధించారు.
- పొందూరు: మండలంలోని తాడివలస జెడ్పీహెచ్ఎస్‌లో 59 మందికి 59 మంది, వావిలపల్లిపేట మోడల్ స్కూల్లో 97 మందికి 86 మంది, తోలాపి జెడ్పీహెచ్ఎస్‌లో 34 మందికి 33 మంది, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 271 మందికి 165 మంది, లోలుగు కేజీబీవీలో 43 మందికి 22 మంది ఉత్తీర్ణులయ్యారు.
- సారవకోట: మండలంలో 449 మంది విద్యార్థులకు 434 మంది పాసయ్యారు.
- ఎల్.ఎన్.పేట: మండలం నుంచి 333 మంది విద్యార్థులకు 270 మంది (81 శాతం) ఉత్తమ ఫలితాలు సాధించారు. లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 140 మందికి 101 మంది, కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో 90 మందికి 67మంది, కొమ్మువలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో 35 మందికి 29 మంది, పూశాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 మందికి 19 మంది, రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 13 మందికి 10 మంది, లక్ష్మీనర్సుపేట కేజీబీవీలో 44 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించారు.
- పోలాకి (నరసన్నపేట): మండల పరిధిలోని ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో సత్తాచాటారు. వంద మందికి 99 మంది ఉత్తీర్ణత సాధించారు.
- పాతపట్నం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 769 మంది విద్యార్థులకు 642 ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ సీహెచ్ మణికుమార్ తెలిపారు. పెద్దలోగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బైదలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల, కాగువాడ మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో శత శాతం మంది పాసయ్యారు. కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 98 శాతం, రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 96 శాతం, గంగువాడ, తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 94 శాతం, బోమ్మిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల 93 శాతం, లాభర గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల 84 శాతం, పాతపట్నం ఉన్నత పాఠశాలలో 144 మందికి 94 మంది పాసయ్యారు.

బూర్జ: మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో 540 మంది విద్యార్థులకు 492 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 31 మందికి 27 మంది (87.10 శాతం), గుత్తావల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 46 మందికి 41 మంది (89.13 శాతం), కే.కే రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 28 మందికి 26 మంది (92.86) శాతం, మామిడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 మందికి 8 మంది (88.89 శాతం), ఓ.వి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 41 మందికి 30 మంది (73.17 శాతం), పాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 88 మందికి 83 మంది (94.32 శాతం), తోటవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 71 మందికి 66 మంది (92.96 శాతం), ఉప్పినివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 మందికి 8 మంది (87.10 శాతం), ఏ.పీ మోడల్ స్కూల్ ఓ.వి.పేట విద్యాలయంలో 100కి 96 మంది (96 శాతం), కేజీబీవీ కొల్లివలసలో 36 మందికి 33 మంది (91.67 శాతం), డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ గురుకులంలో 76 మందికి 74 మంది (97.37 శాతం) సాధించారు.

- జలుమూరు: మండలంలో 533 మంది విద్యార్థులకు 407 మంది (90 శాతం) ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ బి.మాధవరావు తెలిపారు. రామకృష్ణాపురం, యలమంచిలి, కరవంజ మోడల్ స్కూల్ పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించారు.

భవిత విద్యార్థుల ప్రతిభ..

ఆమదాలవలస: పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని భవిత పాఠశాలకు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. బి.సూర్య గీతక, పి.అనిల్‌కుమార్, కె.యోగేంద్ర, బి.కార్తీక్, ఎ.జననీ, పి.భరద్వాజ్ అత్యధిక మార్కులు సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ ఎస్.సునీత, కరస్పాండెంట్ ఎస్.మురళీధరరావు అభినందించారు.

అభివృద్ధే సీఎం జగన్ అజెండా



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- యరగాం సచివాలయాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: అభివృద్ధే అజెండాగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం వెల్లడించారు. మండలంలోని యరగాం గ్రామానికి మంజూరైన గ్రామ సచివాలయం భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఇప్పటివరకు తెలికిపెంట సచివాలయంలో యరగాం, మతలబుపేటలో గోనెపాడు ఉండేవి, ప్రజల ఇబ్బందులను సీఎం దృష్టికి తెచ్చి కొత్తగా యరగాం, గోనెపాడు సచివాలయాలు మంజూరుచేయించినట్లు వెల్లడించారు. ఇంట్లో ఒక ఉద్యోగి ఉంటే ఇంటిల్లిపాది ఉద్యోగులుగా ఉంటారన్న నమ్మకంతో సీఎం విద్యారంగంపై ఎక్కువ దృష్టిపెట్టారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ పర్యటనలో ఉన్నా ఆరోగ్యం బాగులేని అభాగ్యులు తనవద్దకు వస్తే వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుచేస్తున్న మానవతావాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. రానున్న 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు ఘోరపరాజయం తప్పదని స్పీకర్ జోస్యం చెప్పారు. చంద్రబాబుని జనం ఎప్పుడే వదిలేశారన్నారు. రానున్న ఎన్నికల్లో కూన రవికుమార్‌కు డిపాజిట్లు దక్కవన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ బెవర కృష్ణవేణి, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, స్థానిక సర్పంచ్ రావాడ వాగ్దేవి, పార్టీ నేతలు బాన్న రాము, రావాడ రవికుమార్, కింజరాపు సురేష్, బగ్గ రామకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందన వినతులు పరిష్కరించాలి

- జెడ్పీ సీఈఓ వెంకట్‌రామన్



మాట్లాడుతున్న సీఈఓ వెంకట్‌రామన్

జలుమూరు: ప్రతీ సోమవారం మండల కేంద్రంతో పాటు సచివాలయాలకు వచ్చే వినతులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకట్ రామన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో శనవారం సమావేశం నిర్వహించారు. స్పందనకు వచ్చే అర్జీదారులు సంతృప్తి చెందేలా మాట్లాడాలన్నారు. అర్జీదారుడు ఫొటో తీసుకొని అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు వేసి వాటిని కూడా అప్‌లోడ్ చేయాలని కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ సూచించారు. పంచాయతీల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు చేసేందుకు కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. డీఎల్‌డీఓ పడాల వాసుదేవరావు, ఎంపీడీఓ రవి కుమార్, పంచాయతీ విస్తరణ అధికారి పి.ఉమామహేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో 80 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన కింజరాపు సురేష్, తదితరులు

సరుబుజ్జిలి: యరగాం మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కింజరాపు సురేష్‌తోపాటు 80 కుటుంబాల వారు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమయ్యామన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు రావాడ రవికుమార్, బాన్న రాము పాల్గొన్నారు.

సచివాలయాల్లో అన్ని రకాల సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ మంగమ్మ

సారవకోట: సచివాలయాల్లో ప్రభుత్వం సూచించిన అన్ని రకాల సేవలందించాలని డీఎల్‌డీఓ అలువేలు మంగమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రికార్డుల నిర్వాహణ, సిబ్బంది హాజరును శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయం ద్వారా ప్రభుత్వం 576 సేవలందించాలని సూచించిందని, ఆయా సేవలు ప్రజలకు తప్పనిసరిగా అందించాలన్నారు. వివిధ సేవలు అందించడం వల్ల వచ్చే ఆదాయాన్ని వెంటనే ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని సూచించారు. టెక్కలి డివిజన్ పరిధిలో 38 ఆధార్ కేంద్రాలున్నాయని ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. మండల పరిషత్ ఏఓ ప్రసాదరావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పాడిరైతులకు పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిశోర్ సూచించారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట గ్రామంలో శనివారం 20 మంది ఔత్సాహిక పాడిరైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పశు విజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో గర్భధారణ, పశుగోసాల సాగు, యాజమాన్యంపై పలు అంశాలు వివరించారు. పరిశుభ్రమైన పాల ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. లేగదూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగన్నాథం, ఆమదాలవలస సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు, పశువైద్యాధికారి డాక్టర్ వై.హేమలత, పశు సహాయకులు పి.మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



ముర్రాటలతో భక్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలో తురకపేటలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ శుద్ధ బహుళ తదియ కావడంతో స్వామి వారి విగ్రహ ప్రతిష్టను వేదపండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు.

పూజా కార్యక్రమాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, పరిషత్ అఖండ దీపారాధన, హోమాలు నిర్వహించారు. మహిళలు ముర్రాటలు సమర్పించారు. సర్పంచ్ మామిడి దమయంతి, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

కుంకుమార్చనలు



సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో శనివారం అసిరితల్లి గ్రామ దేవత ఆలయ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలను పురోహితులు మనోజ్ శర్మ చేయించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా త్రినాథస్వామి చక్రతీర్థ స్నానాలు



వంశధార నది తీరంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామంలో గల త్రినాథస్వామి ఆలయలంలోని స్వామివారి ఉత్సవ మూర్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం చక్రతీర్థస్నానాలు ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి ప్రత్యేక పూజలు అనంతరం పాడ్యమి ఘడియల్లో స్వామివారిని గ్రామంలో ఊరేగింపుగా వంశధార నదిలోకి తీసుకువెళ్లారు. స్వామి వారికి కైంకర్యాలతో చక్రతీర్థస్నానాలను జరిపారు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో అదనపు ఆదాయం

కొత్తూరు: సుస్థిర వ్యవసాయం సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చునని ఏఓ ఎన్.శ్రీనివాసరావు, వ్యవసాయ సబ్ డివిజన్ యాంకర్ బాబాజీ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సుస్థిర వ్యవసాయం విధానం చేయడంతో రైతులకు ఏ విధంగా అదనపు ఆదాయం వస్తుందన్న అంశం పై ఒక్కరోజు అవగాహన కార్యక్రం శనివారం నిర్వహించారు. సన్న, చిన్నకారు రైతులు తమ పొలంలో పంట పండించడంతోపాటు గొర్రెలు, ఆవులు, కోళ్లు పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ యూనిట్లు నిర్వహిస్తే అదనంగా ఆదాయం వస్తుందన్నారు.

ఒక రైతు 10 వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు చేయడం వల్ల 365 రోజులూ ఆదాయం వస్తుందన్నారు. ఏక కాలంలో బహుళ పంటలు సాగు చేయడంతో అదనపు ఆదాయం పొందగలరని వివరించారు. ఈ కార్యక్రమం స్థానిక ఏపీఎం త్రినాథమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సీతంపేట ఏపీఎం ఈశ్వరరావు, ఎఫ్‌పీఓ, వీడీవీకే డైరెక్టర్స్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి



నరసన్నపేట: లబ్ధిదారులకు సూచనలిస్తున్న ఏఈ శంకరరావు

నరసన్నపేట: మండలంలోని కామేశ్వరిపేటలో గల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శంకరరావు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. కామేశ్వరిపేటలో 50 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. దీంట్లో జగనన్న లేవుట్లో 20 ఇళ్లు, స్వంత స్థలాల్లో 30 ఇళ్లు నిర్మాణం అవుతుండగా.. 27 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 23 ఇళ్లు వివిధ స్థాయిల్లో ఉన్నాయని తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ డి.నర్సింగరావు అన్నారు. మండలంలోని పెద్దకోట, లక్ష్మీనర్సుపేట గ్రామాల్లో శనివారం పర్యటించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమై వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వం లే అవుట్‌లు ఇచ్చి కాలనీ ఇళ్లు మంజూరు చేసిందని వివరించారు. ఇళ్ల నిర్మాణ పనులు స్థాయిల మేరకు వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాదరావు, హౌసింగ్ ఏఈ కె రమేష్, ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముగడ జనార్దన, వర్క్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ అర్జునుడు

పాతపట్నం: కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా ఈ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిజేస్తోందని ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు మోగా సర్వే ఫలితాల్లో కోటి 45 లక్షల కుటుంబాలు పాల్గొన్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ క్యాడర్ నిబద్ధత, పట్టుదలతో పనిచేసిందన్నారు. ఈ సర్వే పారదర్శంగా నిర్వహించారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టలేని అతిపెద్ద పబ్లిక్ సర్వేగా జగనన్నే మా భవిష్యత్తు మోగా పిపుల్స్ సర్వే నిలిందన్నారు.

పాతపట్నంలో భారీ వర్షం



పాతపట్నంలో గాలులతో కూడిన వర్షం

పాతపట్నం: పాతపట్నం పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అచ్చుతపురం, ప్రహరాజపాలేం, కొదూరు, గోపాలపురం, బూరగాం, గంగువాడ, కొరసవాడ తదితర గ్రామాల్లో వర్షం పడడం వల్ల నువ్వు చేను, మొక్కజొన్న పిక్కలను ఎండలో ఆరబెట్టడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మొక్కజొన్నను టార్పాలిన్లతో కప్పారు.

మద్యం అక్రమంగా రవాణ చేస్తే చర్యలు

జలుమూరు: మద్యం అక్రమంగా రవాణా చేసే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఈబీ ఎస్‌ఐ పి.ప్రభాకరరావు అన్నారు. చల్లవానిపేటలో వాహనాలను శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు పలు కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు.

వాహనాల తనిఖీ



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: రోడ్డు నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో శనివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు వివరాలు నమోదు చేశారు. హెల్మెంట్ ధరించని, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేశారు. ఏఎస్ఐ శివాజీ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పిడుగుపాటు..



పిడుగుపాటుకు గురైన కొబ్బరి చెట్టు

మెళియాపుట్టి: మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వానకు జోడూరు గ్రామంలోని కిక్కర వరహాలమ్మ ఇంటి పెరటిలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దాని ప్రభావంతో పక్కనే ఉన్న జీరి పెరుమాలు ఇంటిలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ అయ్యి టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. కరెంట్ మీటర్ సైతం కాలిపోయి ఇంటిలోని ఎలక్ట్రికల్ వైరింగ్ అంతా కాలిపోయిందని బాధితుడు తెలిపాడు.